## సమస్యల పరిష్కారంలో అధికారులు శ్రద్ధ వహించాలి

• ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్, జనవరి 5 : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూరెడ్డి కళావతీసంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యంగా రహదారులు, విద్య, వైద్య రంగాల్లో సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. యాసంగి సీజన్‌లో నియోజక వర్గానికి కాళేశ్వరం జలాలు అందేలా చూడాలని ఎస్సారెస్పీ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీళ్లను సక్రమంగా సరఫరా చేయాలన్నారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ ఇందిర, సర్పంచులు తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, బొల్లెపల్లి అశోక్, గోరుగంటి ఉష, కుందెన అమ్మక్క, ఎంపీటీసీలు పన్నాల రమామల్లారెడ్డి, గాడ్దుల రజిత, మున్న లక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సమన్వయంతో పని చేయాలి


మద్దిరాల : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుడ్ల ఉపేంద్రావెంకన్న అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటినుంచే ప్రణాళికలు చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. గుమ్మడవెల్లి గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణంలో జరిగిన అవకతవకల మీద విచారణ చేపట్టి వారం రోజుల్లో బిల్లులను రికవరీ చేయాలని ఆదేశించారు.

సమావేశంలో జడ్పీటీసీ కన్న సురాంబవీరన్న, ఎంపీడీఓ సరోజ, తాసీల్దార్ అమీన్‌సింగ్ పాల్గొన్నారు.

## అర్హులు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

• ఎమ్మెల్యే మందుల సామేల్

అర్వపల్లి, జనవరి 5 : ప్రజా పాలనతో పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. అర్వపల్లి మండలం తిమ్మాపురంలో నిర్వహించిన గ్రామ సభకు హాజరై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పీడీ కిరణ్‌కుమార్, డీఎస్పీ నాగభూషణం పాల్గొన్నారు.



అర్వపల్లి : తిమ్మాపురంలో మహిళ నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

### ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్

### కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

బొడ్రాయిబజార్ : ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారంతా శనివారం సాయంత్రం వరకు ఆయా గ్రామాలు, వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామ సభల్లో దరఖాస్తులు అందజేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. సూర్యాపేట పట్టణంలోని పలు వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి మాట్లాడారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు అధికారులకు శిక్షణ పూర్తి చేసినట్లు వివరించారు. కార్యకమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, కౌన్సిలర్లు కట్కూరి కార్తీక్‌రెడ్డి, అనంతుల యాదగిరి, పంతంగి దశరథ, తన్వీర్, అక్కిరెడ్డి ఉపేంద్రారెడ్డి, డాక్టర్ భాయ్, ఫరీదుద్దీన్, అహ్మద్ పాల్గొన్నారు.



మోత్కూరు మండలంలోని దాచారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి పి.యాదయ్య

సూర్యాపేట రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని జడ్పీ సీఈఓ సురేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని టేకుమట్ల, ఎర్కారం గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, ఇరిగేషన్ ఈఈ భద్రూనాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్ : మండలంలోని బొట్యతండా, నసీంపేట, కోటినాయక్‌తండా, దాచారం గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలో తాసీల్దార్ సీహెచ్.కృష్ణయ్య, ఎంపీడీఓ మల్సూర్‌నాయక్ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు నాగేంద్రశర్మ, వెంకట్‌రెడ్డి, డీటీ పుష్ప, ఏఓ దివ్య, ఏఈ గౌతమ్, ఎస్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మోత్కూరు, జనవరి 5 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ప్రజా పాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి, మండల ప్రత్యేకాధికారి పి.యాదయ్య అన్నారు. మండలంలోని దాచారంలో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాసీల్దార్ రామ్‌ప్రసాద్, ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, సర్పంచ్ అండెం రజితారాజిరెడ్డి పాల్గొన్నారు.

## రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు

• డీఎస్పీ నాగభూషణం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

అర్వపల్లి, జనవరి 5 : సోషల్ మీడియాలో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నాగభూషణం అన్నారు. శుక్రవారం అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పది రోజుల్లో మండలంలో పలు గ్రామాల వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడం వల్ల రెండు కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలు ఏ గ్రూపులో పోస్ట్ చేసినా గ్రూప్ అడ్మిన్‌తో పాటు పోస్ట్ పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు మొబైల్‌ను సీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ అంజిరెడ్డి ఉన్నారు.

## 10న అక్షర సంక్రాంతి సంబురాలు

సూర్యాపేట అర్బన్, జనవరి 5 : అక్షర ఫౌండేషన్, ఎస్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న అక్షర సంక్రాంతి సంబురాలు నిర్వహిస్తున్నట్లు అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రామ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంబురాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, కోలాటం, గాలిపటాలు ఎగురవేయుట పోటీలతో పాటు చిన్నారులకు రేగి పండ్లు పోయడం, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.3,116, ద్వితీయ రూ.2,516, తృతీయ రూ.2,016, కన్సోలేషన్ రూ.1,516 అందించనున్నట్లు చెప్పారు. పోటీలను జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న అక్షర ఫౌండేషన్ సభ్యులు

## సైంటిఫిక్ రంగోలితో శాస్త్రీయ పరిజ్ఞానం

• హెచ్‌ఎం పద్మ



సైంటిఫిక్ రంగోలి మహోత్సవంలో పిరియాడిక్ టేబుల్ వేసిన విద్యార్థులు

సూర్యాపేట అర్బన్, జనవరి 5 : విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు సైంటిఫిక్ రంగోలి మహోత్సవం ఎంతగానో తోడ్పడుతుందని జడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోలి పద్మ అన్నారు. సూర్యాపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జన్య సైంటిఫిక్ రంగోలి మహోత్సవం, సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించి మాట్లాడారు. జన్య ల్యాబ్ ఇన్ ఏ బాక్స్ కార్యక్రమంలో భాగంగా జన్య ఫౌండేషన్, సువేన్ సంయుక్త ఆధ్వర్యంలో సమకూర్చిన బోధన, అభ్యాసన పరికరాలతో తరగతి గదిలో కృత్యాల ద్వారా నేర్చుకున్న సైన్స్, గణితం అంశాలను విద్యార్థులు ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. మానవ శరీరంలోని వివిధ అవయవాలను రంగోలి రూపంలో వేసి ఆకట్టుకున్నారు.. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది, జన్య ఫౌండేషన్ సభ్యులు శివకుమార్, అక్బర్, సువేన్ ట్రస్ట్ నిర్వాహకులు సీహెచ్.వెంకట్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.



నడిగూడెంలో ఇంటింటికీ అయోధ్య రామమందిర అక్షింతలను పంపిణీ చేస్తున్న రామ భక్తులు

## ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు

నేరేడుచర్ల, జనవరి 5 : అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా కలశాలలో పంపించిన అక్షింతలను శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. అక్షింతలతో పాటు రామ మందిరం చిత్రపటం, వివరాలతో కూడిన కరపత్రాన్ని అందజేశారు.



నేరేడుచర్లలోని 11వ వార్డులో ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

నడిగూడెం : అయోధ్య రామ మందిర అక్షింతలను మండల కేంద్రంతో పాటు రత్నవరంలో రామ భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ 22న అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం ప్రతి ఇంట్లో దీపాలను వెలిగించి అక్షింతలను తలపై వేసుకోవాలని సూచించారు.

## జాన్‌పహాడ్ దర్గా సఫాయిబావి పూడికతీత

• సీఐ సైదులు చొరవతో పనులు



పూడికతీత పనుల్లో భాగంగా సఫాయిబావి వద్ద ఏర్పాటు చేసిన క్రేన్

పాలకవీడు, జనవరి 5 : హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీకైన జాన్‌పహాడ్ దర్గా వద్ద గల పవిత్ర సఫాయిబావి పూడికతీత పనులు దాత యరగొర్ల సైదులు సహకారంతో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని సజ్జాపురం గ్రామానికి చెందిన యరగొర్ల సైదులు హైదరాబాద్‌లో సీఐగా పని చేస్తున్నారు. ఉర్సుకు వచ్చే భక్తులు స్నానాలు చేయడానికి వీలుగా తనవంతుగా సొంత ఖర్చులతో బావి పూడికతీత చేపట్టినట్లు ఆయన తెలిపారు. దర్గా ముజావర్ జానీ, గ్రామస్తులు దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు సూర్యాపేటకు దేవనాథ జీయర్‌స్వామి రాక

బొడ్రాయిబజార్, జనవరి 5 : జిల్లాలో పర్యటిస్తున్న త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి శనివారం సాయంత్రం సూర్యాపేట పట్టణానికి చేరుకుని వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి దేవాలయాలను సందర్శించనున్నట్లు ఆయా ఆలయాల ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, మురళీధరాచార్యులులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా రాజన్నమాదిగ

బొడ్రాయిబజార్, జనవరి 5 : మహాజన సోషలిస్ట్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన యాతాకుల రాజన్నమాదిగ ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఎంఎస్పీ సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నట్లు ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి తూరుగంటి అంజన్న తెలిపారు. జిల్లా అధికార ప్రతినిధిగా ఏపూరి రాజు, ఉపాధ్యక్షులుగా పాల్యాయి బాలయ్య, సిద్దెల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి అంజయ్య, దాసరి వెంకన్న, కార్యదర్శులుగా పుట్టల మల్లేశ్, కందుకూరి శ్రీనివాస్, బచ్చలకూరి ప్రసాద్, బొడ్డు కుటుంబరావు, ప్రచార కార్యదర్శిగా దైద వెంకన్న, పాలెపాక అంజయ్య, ఎడవెల్లి చంద్రయ్య, కస్తల వెంకటేశ్వర్లు, నకిరేకంటి రవి, సహాయ కార్యదర్శిగా వెంకటి ఎన్నికయ్యారు.

## మేళ్లచెర్వు పంచాయతీ రికార్డులు స్వాధీనం

మేళ్లచెర్వు, డిసెంబర్ 5 : మేళ్లచెర్వు గ్రామ పంచాయతీ కార్యాలయ రికార్డులను కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ నేతృత్వంలో అధికారులు శుక్రవారం పరిశీలించారు. పలు అంశాల్లో అవకతవకలు జరిగాయంటూ జిల్లా కలెక్టర్‌కు పలు ఫిర్యాదులు అందడంతో ఆయన ఆదేశం మేరకు పరిశీలన చేసి రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్డీఓ తెలిపారు.